క్లుప్తంగా

ప్రతిభా పురస్కారాలకు విద్యార్థుల ఎంపిక

సంతమాగులూరు(అద్దంకి): ప్రభుత్వం ఇచ్చే ప్రతిభా పురస్కారాలకు పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేస్తూ విద్యా శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఎంఈఓ కోటేశ్వరరావు గురువారం తెలిపారు. వారిలో కె. సిరి అమూల్య, ఎస్. హైమావతి, కె. విజయరాణి, ఏ. కుసుమాంజలి, ఎం. అభిరామ్, ఎస్కే జాన్ నసీం ఉన్నారని తెలిపారు.

యద్దనపూడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతిలో మార్చి 2025 మెరిట్ మార్కులు సాధించిన 6 గురు విద్యార్థులు ప్రతిబా అవార్డులు సాధించారు. వీరిలో గుంజి శ్రీనాథ్(580), అప్పలనేని షణ్ముఖ ప్రియ(564), పల్లపు భార్గవి(574), పరి శోభ(582), సురే ధాత్రి (538), దేవరకొండ వైష్ణవి(526) మార్కులు రాగా వీరికి షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో పూనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పల్లపు భార్గవి, సురే ధాత్రి, విద్యార్థినిలు అవార్డులకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు అబ్బరాజు మల్లిఖార్జున శ్రీనివాసరావు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీమురళీ బాపూజీ అన్నారు. గురువారం ఈపురుపాలెంలో చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. డస్ట్ బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేసి అందించాలన్నారు.

రుణాలు చెల్లించాలి

చీరాల టౌన్: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం మధుసూధనరావు సూచించారు. గురువారం బుర్లవారిపాలెంలోని వెలుగు కార్యాలయంలో మండలంలోని వీఓఏలకు సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంస్థలు, వ్యాపారాలను వీఓఏలు పరిశీలించి పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ సంఘాల పుస్తకాలను విధిగా రాయడంతో పాటు సీఐఎఫ్, స్త్రీనిధి, సబ్‌ప్లాన్ రుణాలన్నీ వందశాతం సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

చీరాల రూరల్: బాల, బాలికలను పనులలో పెట్టుకుని వెట్టిచాకిరీ చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కార్మిక శాఖాధికారిణి సాయిజ్యోతి హెచ్చరించారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో గురువారం చీరాల పట్టణంలో చైల్డ్‌లేబర్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలు, మెకానిక్, కిరాణా షాపుల్లో ధికారులు తనిఖీలు నిర్వహించారు. ఒక దుకాణంలో బాలుడు పనిచేస్తున్న విషయాన్ని గుర్తించి దుకాణదారులకు చైల్డ్‌లేబర్‌పై అవగాహన కల్పించారు. షాడోస్ సంస్థ నిర్వాహకులు రాజా సాల్మన్ మాట్లాడుతూ పిల్లలంతా బడికి వెళ్లి చదువుకోవాలని సూచించారు. నాగరాజు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలతో మేలు

బల్లికురవ: బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలకు ఖాతాదారులు ప్రీమియం చెల్లింపుతో నమోదు చేసుకోవాలని బల్లికురవ ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంకు చీఫ్ మేనేజర్ కె. సీనానాయక్ కోరారు. నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన జాగర్లమూడి వెంకటేశ్వర్లు బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజనాలో పేరు నమోదు చేసుకుని ఇటీవల అనారోగ్యతంతో మృతి చెందాడు. గురువారం మృతుని భార్య శ్రీదేవికి రెండు లక్షల రూపాయల చెక్కు అందజేశారు. మేనేజర్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్ బిందు మాధవి పాల్గొన్నారు.

ఆహారం పరిశుభ్రంగా ఉండాలి

కారంచేడు: ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించే ఆహారంను రుచి, శుచిగా ఉండాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం వారు స్థానిక ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్ కట్టా సుకన్య, సీఆర్పీలు కమలాకర్, వెంకాదాస్, విష్ణు పాల్గొన్నారు.

శిబిరంతో నైపుణ్యాలు

చినగంజాం: వేస శిక్షణ శిబిరంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగయ్యాయని చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమానికి గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు అధ్యక్షత వహించగా జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్. నరసింహరావు, సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బహుమతులు, సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు.

విజ్ఞానం.. వినోదం

- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు
- సద్వినియోగం చేసుకుంటున్న బాలబాలికలు
- పలు అంశాలపై పట్టు సాధిస్తున్న విద్యార్థులు


తెలుగు చదవడం రాయడంపై వివరిస్తున్న గ్రంథపాలకుడు

చినగంజాం: విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులు బహుళ ప్రయోజనాలు పొందుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను గత కొద్ది సంవత్సరాలుగా ప్రతి ఏడా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చినగంజాం శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. వేసవిలో వేసవి తీవ్రత విద్యార్థులపై ప్రభావం చూపకుండా ఉండేందుకు శిక్షణ తరగతులను ఉదయం 8 గంటల నుంచి 11 గంటలు వరకు నిర్వహిస్తున్నారు. చినగంజాం శాఖ గ్రంథాలయం గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిష్ణాతులైన వర్తమాన ప్రభుత్వ ఉపాధ్యాయ సిబ్బందిని రిసోర్స్ పర్సన్‌లుగా తీసుకొని 3 గంటల పాటు వివిధ అంశాలపై విద్యార్థులకు ఉచితంగా తర్ఫీదు ఇస్తున్నారు. తమ పిల్లలు వేసవిలో ఆరుబయట తిరగకుండా ఎంతో కొంత జ్ఞానాన్ని సముపార్జించుకుంటారనే సదుద్దేశంతో తల్లిదండ్రులు సైతం ఎంతో ఆసక్తిగా వేసవి శిక్షణ తరగతులకు వారే స్వయంగా తీసుకొనివచ్చి వదలి వెళుతున్నారు. గ్రంథాలయం కాస్తంత దూరమయినప్పటికీ మండల పరిధిలోని పలు పంచాయతీల నుంచి తమ చిన్నారుల చదువు పట్ల ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు శిక్షణ శిబిరాల పట్ల ఆసక్తి చూపుతున్నారు.

శిక్షణ శిబిరంలో వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ

వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు వివిధ అంశాలపై నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందజేస్తున్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు అవసరమైన అనేక ప్రక్రియలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా చదవడం, రాయడం, కథలు చదవడం, వినడం, చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, స్పోకెన్ ఇంగ్లిషు, ఇంగ్లిషు గ్రామర్, కంప్యూటర్ విద్య, యోగాసనాలు వంటి అంశాలపై విద్యార్థులకు తర్ఫీదునిచ్చి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఎప్పటి కప్పుడు పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహించేందుకు వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయడం వంటి పలు కృత్యాలను శిక్షణ శిబిరంలో నిర్వహిస్తున్నారు. నిత్యం విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తూ వారిలో దాగి ఉన్న నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. దీంతో పాటు విద్యార్థులకు అల్పాహారం అందజేస్తూ వారిలో ఉత్సాహాన్ని పెంచుతున్నారు. విద్యార్థులకు దాతల ద్వారా పౌష్టికాహారాన్ని సమకూర్చి అందజేస్తున్నారు.

సంతృప్తి వ్యక్తం చేసిన ప్రముఖులు

చినగంజాం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సందర్శించి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వాహణ పట్ల గ్రంథపాలకుడు తీసుకుంటున్న కృషిని కొనియాడారు. ఆమెతో పాటు చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు డి. రత్న కుమారి తరగతులను సందర్శించి విద్యార్థుల పట్ల నిర్వాహకులు శ్రద్ధ తీసుకొని శిక్షణ ఇవ్వడంపై ఆమె అభినందనలు తెలియజేశారు. అదే విధంగా ప్రముఖ తెలుగు సాహితీ వేత్త కుక్కల శ్రీరామచంద్రమూర్తి రెడ్డి, ఎల్ఐసీ డవలప్‌మెంట్ అధికారి జి. శ్రీరామ చంద్రమూర్తి తదితరులు శిక్షణ తరగతులకు విచ్చేసి తమ సందేశాలను అందించడంతో పాటు విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు.


వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి


ఇంగ్లిషు గ్రామర్‌పై బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు నరసింహారావు

ఘనంగా సాయి ఆలయ వార్షికోత్సవం


అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

చినగంజాం: మండల కేంద్రమైన చినగంజాంలోని హనుమ సాయి కుటీరంలో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయ 18 వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయంలో పూజా కార్యక్రమాలు, నగర సంకీర్తనలు, పల్లకి సేవలు నిర్వహించారు. చినగంజాం, సోపిరాలలో మహిళ కోలాట భజనలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాయి బాబా మందిర ప్రాంగణంలో సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ సాయి దంపతులు, వెంకటేశ్వర సాయి, నిర్వాహణ కమిటీ సభ్యులు గుండ్రెడ్డి నరసింహారావు, పోలయ్య, ప్రభాకర విశల్ రావు, కళ్యాణి, పుల్లమ్మ, రామాంజమ్మ, సావిత్రి, శారదా, కనకవల్లి తదితరులు పాల్గొన్నారు.

పనిదినాల పెంపు దుర్మార్గం



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



నిరసన ర్యాలీ చేస్తున్న కార్మికులు

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా పని దినాల గంటలను పెంచుతూ కక్షపూరిత ఆలోచనకు వ్యతిరేకంగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మికులతో ధర్నా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు మాట్లాడుతూ కూటమి, మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌లో భాగంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని రద్దు చేసిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకోవడానికి కార్మికులు సిద్ధం కావాలన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులన్నీ కోల్పోతారన్నారు. యజమానుల లాభాలు పెరుగుతున్నాయని, మరో వైపు కార్మికులకి వేతనాలు రోజురోజుకు పడిపోతున్నాయన్నారు. వ్యాపారం సులభతరం పేరుతో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కార్మిక చట్టాలు మార్చుని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమించాలన్నారు. సీఐటీయూ అధ్యక్షులు ఎస్.బాబూరావు, పి.కాలేషా, గేరా క్రాంతిసాగర్, జి.ఇమ్మానియేలు, బి. రాంబాబు, బి. వెంకటేశ్వర్లు, కె.పోతురాజు, గూడూరు కోటేశ్వరి, బిందు, ఏసమ్మ జి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: కార్మిక చట్టాలను తెలుగుదేశం కూటమి ప్రభుత్వ కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. కార్మిక చట్టాలను నీర్వీర్యం చేసే పనిలో భాగంగా ఎనిమిది గంటల పని విధానాన్ని పది గంటలకు మార్పు చేయడం దారుణమన్నారు. ఇది కార్మిక చట్టాన్ని కాలరాయడం కాదా అని ప్రశ్నించారు. దీనిని నిరసిస్తూ గురువారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఫ్రూట్ వెండర్స్ ఆటో వర్కర్స్, తదితర కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలు పర్యావరణ నేస్తాలు


తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య


వేటపాలెం: మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రాజేష్


అద్దంకి: ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

వేటపాలెం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని కాపాడు కోవడంలో భాగస్వాలు కావాలని ఎంపీడీఓ రాజేష్ పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక బీబీహెచ్ హైస్కూల్ ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటి, పర్యావరణ పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మానవ ఆవాసానికి మానవ జీవితానికి సకల ప్రాణుల మనుగడకు ప్రకృతి ఆవశ్యకత ఉందన్నారు. మనం పీల్చే గాలి నుంచి తాగే ప్రతి నీటి చుక్క ప్రకృతి నుంచి మనకు లభించేదే అని తెలిపారు. ప్రకృతి లేనిదే జీవుల మనుగడ లేదన్నారు. జీవ వైవిధ్యం దెబ్బ తింటే మొత్తం సృష్టికి ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా.. తరుగుతున్న వనరులు తద్వారా మనిషికి అత్యాశ, స్వార్థం ముదిరి ప్రకృతిలోని సమతుల్యతను దెబ్బతీస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కర్బన ఉద్గారాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని, అడవులను ధ్వంసం చేసి చెట్లను నరికి వేయడం వల్ల ఆక్సిజన్ శాతం తగ్గిపోతోందని తెలిపారు. ఇంటి చుట్టూ మొక్కలు పెంచి.. రాబోవు తరాలను కాపాడు కుందామని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి మోహన్‌రంగా, కరస్పాండెంట్ వాసుదేవరావు, ప్రిన్సిపాల్ బాల సుబ్రహ్మణ్యం, దొగుపర్తి బాలకృష్ణ, నాగు, సజ్జా కోటేశ్వరరావు, సుభాని రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: పార్యవరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పోషించాలని నీయోజకవర్గ ప్రత్యేకాధికారి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో బాలమ్మ అన్నరు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొప్పెరపాడు, ఉన్నత పాఠశాల, సుజాతీ నగర్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. వర్షాలు కురుస్తున్నందున ఉద్యమంలా ప్రభుత్వ స్థలాలుచ పాఠశాలలు, రోడ్ల వెంట మొక్కలు నాటాలని కోరారు. ఎంపీడీవో కుసుమకుమారి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి సుమతి, సెక్రటరీ ఎస్. సాయిబాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

యద్దనపూడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యద్దనపూడి మండల కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ మహ్మద్ అజీబ్ జావేద్ గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీఓ పీటీవీ కృష్ణ, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

పర్చూరు(చినగంజాం): పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్య మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడేందుకు వివిధ రకాల మొక్కలు నాటినట్లు వివరించారు. డీటీ సుధారాణి, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: నియోజకవర్గంలోని ఐదు మడలాల్లో గురువారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోర్టు భవనాల సముదాయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి. అఖిల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. తరువాత పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యడవల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గృహలక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ ఆధ్వర్యంలో..

పట్టణంలోని మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దానిలో భాగంగా సంజీవనగర్ సచివాలయం వద్ద కమిషనర్ రవీంద్ర మొక్కలు నాటారు. మాజీ రోటరీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తుల ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ సందర్భంగా బాలబాలికలకు వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కాకానిపాలెం ఎంపీపీ పాఠశాల పక్కనే ఉన్న త్రిమూర్తులు నివాసంలో నిర్వహించారు. పాఠశాలలో వివిధ రకాల మొక్కలను నాటారు. శింగరకొండ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు.

సంతమాగులూరు గ్రంథాయంలో గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ పి. నాగేశ్వరరావు, పెద్దలు పాల్గొన్నారు.

కారంచేడు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమాల్లో భాగంగ ఏపీఓ లక్ష్మీదేవి సారధ్యంలో ఆలయ ప్రాంగణంలోని కోనేరు మరమ్మతుల కోసం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కోటా నాయక్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ రత్తయ్య చౌదరి, ఆలయ నిర్వాహకులు యార్లగడ్డ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల రూరల్: పర్యావరణం పదిలంగా ఉండాలంటే ఇంటికొక మొక్క చొప్పున మొక్క నాటాలని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైస్కూలు క్రీడామైదానంలో మొక్కలు నాటారు. పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ వాకర్స్ సభ్యులు కొత్తమాసు శ్రీనివాసరావు క్రీడా మైదానంలో అనేక మొక్కలు రక్షించాడని చెప్పారు. మొక్కలు విలువ అందరికీ తెలిసే విధంగా బోర్డులు వేయించడమే కాకుండా కరపత్రాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గోవుల పోషణ నిమిత్తం శ్రీకృష్ణ గోశాలకు రూ. 3,000 శ్రీనివాసరావు అందజేశారు. పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, వలివేటి మురళీకృష్ణ, నారాయణమూర్తి, పూర్ణ, శ్రీనివాసరావు, ఉమా మహేశ్వరరావు, వీరాంజనేయులు, శివాంజనేయప్రసాద్, రాధాకృష్ణ, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో అలసత్వం వద్దు

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందచడంతో పాటు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని తహసీల్దార్ కె.గోపికృష్ణ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తూ అందుబాటులో ఉండాలన్నారు. ఓటీఎస్ వివరాలు, పెండింగ్ అర్జీలపై విచారించారు. విధుల్లో అశ్రద్ధ వహించినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు


క్షతగాత్రున్ని తీసుకెళుతున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

జె.పంగులూరు: బైక్ పై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని బైకు ఢీ కొనడంతో బైక్ పై ముందు వెళుతున్న వ్యక్తి కాలుకు తీవ్ర గాయమైన సంఘటన గురువారం మండల పరిధిలోని రేణింగవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. మార్టూరు నుంచి వసంత కృష్ణ అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై అద్దంకి వెళుతున్నాడు. మార్టూరు నుంచి జాతీయ రహదారిపై రేణింగవరం సమీపంలోకి వచ్చే సరికి వెనక నుంచి గుర్తు తెలియని మరో బైక్ ఢీ కొని వెళ్లి పోయింది. ప్రమాదంలో వసంత కృష్ణ కింద పడిపోయి ఎడమ కాలు బోను విరిగింది. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రున్ని ఒంగోలు తరలించారు. రేణింగివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి సాగుకు సమాయత్తం కావాలి


రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి సుమతి

చీరాల రూరల్: సాగునీరు జూన్ మొదటి వారంలో విడుదలవుతున్నందున ఖరీఫ్‌లో వరిసాగుకు రైతులు సమాయత్తం కావాలని మండల వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమాన్ని గురువారం చీరాల నగర్, కొత్తపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుమతి మాట్లాడారు. వరి సాగు చేసే రైతులు విధిగా పొలాలను దున్ని ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. రైతులు జీలుగా విత్తనాలు 50 శాతం రాయితీతో పొంది భూమిలో కలియదున్నాలని తెలిపారు. రైతులు మన ప్రాంతాలకు అనుకూలమైన వరి రకాలైన ఎంటీయూ, 1262,1271, ఎస్ఎల్ఆర్-33892, బీపీటీ-2270, బీపీటీ-2595, బీపీటీ-2782, ఎంటీయూ-1224 లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వీఏఏలు లావణ్య, బత్షెబా, రైతులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని తిరగబడిన లారీ

జె.పంగులూరు: మామిడికాయ లోడు లారీ అదుపు తప్పి తిరగడిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని ముప్పవరం ఫ్లై ఓవర్ ఎంట్రన్స్‌లో జరిగింది. ఒంగోలు వైపు నుంచి విజయవాడ వెళుతున్న మామిడి కాయలు లారీ ముప్పవరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే అదుపు తప్పి ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకుని సర్వీస్ రోడ్‌లో బోల్తా పడింది. ఆ సమయంలో ఆ లారీ డ్రైవర్ గా షేక్ తాజుద్దీన్ ఉన్నారు. అతని ఎలాంటి గాయాలు కాలేదు.

నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల
అధ్యక్షుల నియామకం

అద్దంకి:

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అద్దంకి నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. యూత్ వింగ్ అధ్యక్షునిగా బొనిగల మధుబాబు, మహిళా విభాగానికి రావిపాటి కాశీదేవి, రైతు విభాగానికి స్వయంపు హనుమంతరావు, బీసీ సెల్‌కు గోలి రమణబాబు, ఎస్సీ సెల్‌కు జ్యోతి రోశయ్య, ఎస్టీ సెల్‌కు పేరం నాగలక్ష్మి, మైనారిటీ విభాగానికి షేక్ మట్లపూడి బాజీవలి, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు పరమి ప్రసాద్, స్టూడెంట్ వింగ్‌కు పి. ప్రశాంత్ రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్‌కు అన్నెం అంజిరెడ్డి, మునిసిపల్ వింగ్‌కు కె. వెంకట సుబ్బారావు(బాలు), ఆర్టీఐ వింగ్‌కు ముత్తవరపు రమణయ్య, వాణిజ్య విభాగానికి ఊడత్తు సురేశ్, వీకర్స్ వింగ్‌కు షేక్ ఖాదర్ వలి, వైఎస్సార్‌టీయూసీ వింగ్‌కు జొన్నలగడ్డ రామాచార్యులు, లీగల్ సెల్ వింగ్‌కు యర్రమోతు రమేశ్ బాబు, కల్చరల్ వింగ్‌కు బండి కోటిరెడ్డి, సోషల్ మీడియా సెల్‌కు యు. కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐటీ వింగ్‌కు భవనం విష్ణువర్ధన్ రెడ్డి, దివ్యాంగుల విభాగానికి జొన్నలగడ్డ రమేశ్, డాక్టర్స్ వింగ్‌కు అడవి భాస్కర్, ఇంటలెక్టువల్స్ వింగ్‌కు సీహెచ్ చలమారెడ్డి, బూత్‌కమిటీ వింగ్‌కు మానికేని శ్రీనివాసరావు, పబ్లిసిటీ వింగ్‌కు తెలుకుట్ల మురహరిని నియోజకవర్గ స్థాయి అధ్యక్షులుగా నియమించారు.